క్లుప్తంగా

సుదర్శన హోమం



శ్రీ క్షేత్రంలో సుదర్శన హోమం జరిపిస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: ప్రపంచ భారతీయ తత్వదర్శన శ్రీ క్షేత్రంలో మంగళవారం ప్రపంచ శాంతి కోసం సుదర్శన హోమం జరిపారు. అష్టలక్ష్మీసమేత ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో అర్చకులు చామర్తి రమేష్ అచార్యులు, అంపోలు లక్ష్మి నర్సింహ అచార్యులు హోమంను భక్తి శ్రద్ధలతో జరిపారు. ఆలయ ధర్మకర్తలు దుర్గా బాలాజీ, ఉమాదేవి దంపతులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

తుది పరీక్షకు 448 మంది ఎంపిక



పరుగు పందెంలో పాల్గొన్న అభ్యర్థులు

విజయనగరం క్రైమ్: పోలీస్ నియామకాల్లో భాగంగా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సజావుగా సాగుతున్నాయి. 15వ రోజు మంగళవారం నిర్వహించిన పరీక్షలకు 652 మంది హాజరుకాగా, తుది రాత పరీక్షకు 448 మంది అర్హత సాధించినట్టు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఇప్పటి వరకు 3,745 మంది పురుష అభ్యర్థులు, 479 మంది మహిళా అభ్యర్థులు తుది రాత పరీక్షకు అర్హత సాధించారన్నారు. నియామక ప్రక్రియను అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, డీఎస్పీలు పర్యవేక్షించారు.

సపక్‌తక్రా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో అయ్యలు, తదితరులు

విజయనగరం రూరల్: ప్రకాశం జిల్లా పాదిలిలో ఈనెల 16, 17వ తేదీల్లో జరిగిన 28వ జూనియర్ సపక్ తక్రా రాష్ట్రస్థాయి బాల బాలికల పోటీల్లో జిల్లాకు చెందిన యు.కావ్యాంజలి, కె.అశ్వని, రీతుసాయి, పవిత్ర, ఎస్.చాందినిలు అద్భుతమైన ప్రతిభ కనబర్చారు. బాలికల విభాగంలో మూడోస్థానంలో నిలిచారు. వీరిని ఒలిపింక్ సంఘ అధ్యక్షుడు గురానా అయ్యలు తన కార్యాలయంలో మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో సీహెచ్ వేణుగోపాలరావు, రాజేష్, కోశాధికారి భవానీ పాల్గొన్నారు.

వాసవీక్లబ్ నూతన కమిటీ ఏర్పాటు



ఎన్నికైన వాసవీ క్లబ్ నూతన కమిటీ సభ్యులతో డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం రూరల్: సమాజ సేవలో వాసవీ క్లబ్‌దే ప్రథమ స్థానమని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. మంగళవారం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో వాసవీక్లబ్ నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకరోత్సవానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్యవైశ్యులు తాము సంపాదించిన మొత్తంలో అధిక శాతం సమాజ సేవకే వినియోగిస్తున్నారన్నారు. ఇదే బాటలో ప్రతీ ఒక్కరు నడుచుకోవాలని పిలుపునిచ్చారు. వాసవీ పూర్వ క్లబ్ 2024లో ఆరు ఇంటర్నేషనల్ అవార్డులు పొందిందని అదే తరహాలో నూతన కమిటీ పనిచేసి మరిన్ని అవార్డులను సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు విజ్జపు విజయ్‌కుమార్, కార్యదర్శి కంచర్ల వెంకటస్వామి, కోశాధికారి వజ్రపు కృష్ణారావు, క్లబ్ వనితా అధ్యక్షురాలు కె.రమాదేవి పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో సేవలు వినియోగించుకోవాలి

విజయనగరం అర్బన్: ఆర్టీసీ సంస్థ అందిస్తున్న కార్గో సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని పార్సిల్ మరియు కొరియర్ విభాగం విజయనగరం కమర్షియల్ మేనేజర్ బి.అప్పలనాయుడు కోరారు. డోర్ డెలివరీ మాసోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్గో సేవల్లో విధులు నిర్వహిస్తున్న కౌంటర్ సిబ్బంది, హమాలీల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రతి పార్శిల్‌ను కేవలం 48 గంటలలోపు చేరుకునే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి సీహెచ్ అప్పలనారాయణ, కమర్షియల్ మేనేజర్ హెచ్.దివ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం పుష్కలం.. సేవలు శూన్యం...!



పూసపాటిరేగ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

- గాడి తప్పుతున్న పూసపాటిరేగ ఏఎంసీ
- పాలకవర్గం లేక పక్కదారి పడుతున్న పాలన
- ఏడుగురు ఉద్యోగులకుగాను ఇద్దరితోనే నిర్వహణ
- జిల్లాలో అత్యధిక ఆదాయం పూసపాటిరేగ మార్కెట్ కమిటీదే..
- అయినా రైతులకు సరిగా అందని సేవలు

గడిచిన మూడేళ్లలో మార్కెట్ కమిటీ లక్ష్యం.. ఆదాయ వివరాలు...

సంవత్సరం	లక్ష్యం	ఆదాయం
2022–23	రూ.1.20 కోట్లు	రూ.1.40 కోట్లు
2023–24	రూ.1.61 కోట్లు	రూ.1.62 కోట్లు
2024–25	రూ.1.67 కోట్లు	రూ.1 కోటిపైనే..

పూసపాటిరేగ : పూసపాటిరేగ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం నిర్వహణ గాడి తప్పుతోంది. పాలక వర్గం నియామకం కాకపోవడంతో పాటు ఏఎంసీకి సిబ్బంది కొరత వుండటంతో పాలన అంతంత మాత్రమే వుంది. ఏఎంసీకి ఆదాయం ఫుల్‌గా వస్తున్నప్పటికీ రైతులకు సేవలు అందించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఏఎంసీకి ఏడాదికి ఇచ్చిన లక్ష్యం కంటె అదనంగా ఆదాయం వస్తున్నప్పటికి సిబ్బంది కొరతతో రైతులకు అందించబోయే సేవలకు అంతరాయం కలుగుతోంది. కమిటీలో ఏడుగురు సిబ్బంది వుండాల్సి ఉండగా కేవలం ఒక్క కార్యదర్శి, ఒక్క సూపర్‌వైజర్‌తో కాలం వెళ్లదీస్తున్నారు. మార్కెట్ కమిటీకి సంబంధించిన కమిటీ చైర్మన్, డైరెక్టర్లు నియామకం కాకపోవడంతో ప్రశ్నించేవారు లేకపోవడంతో ఏఎంసీ పాలన ఇష్టారాజ్యంగా వుంది. చెక్‌పోస్టులు, ట్రేడ్ లైసెన్సుదారులు నుంచి వస్తున్న ఫీజులు కమిటీకి పూర్తి స్థాయిలో రావడం లేదనే విమర్శలు వున్నాయి. రైతులకు సేవలు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మార్కెట్ కమిటీ పాలనా వ్యవహారాలు చూడాల్సిన పోస్టులు గత కొంత కాలంగా ఖాళీగా ఉన్నాయి. టైపిస్టు, అసిస్టెంటు మార్కెటింగ్ సూపర్‌వైజర్, జూనియర్ మార్కెటింగ్ సూపర్‌వైజర్, అటెండర్, వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా వున్నాయి. కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించిన సెక్యూరిటీ గార్డుల తోనే కార్యాలయం నిర్వహిస్తున్నారు. పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం, నెల్లిమర్ల మండలాలకు చెందిన ప్రజలకు సేవలందించాల్సిన పూసపాటిరేగ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని ఉన్నతాధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ద్వారా రైతులకు సేవలు అందించాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం



పూసపాటిరేగ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సిబ్బంది ఖాళీలపై ఉన్నతాధికారులకు నివేదించాం. గత కొంత కాలంగా సిబ్బంది కొరత ఉంది. మార్కెట్ కమిటీలో ఏడుగురు సిబ్బంది వుండాలి. కాని ఇద్దరు సిబ్బందితోనే కాలం గడుపుతున్నాం. కార్యదర్శి, సూపర్‌వైజర్ మాత్రమే వున్నారు. మిగతా సిబ్బందిని త్వరితంగా భర్తీ చేయడానికి ఉన్నతాధికారులతో మాట్లాడుతాం. – చిన్నమ్మలు, సూపర్‌వైజర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ, పూసపాటిరేగ

‘పీఎం సూర్యఘర్ యోజన’పై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఈఈ సురేష్‌బాబు

పూసపాటిరేగ : పీఎం సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్‌శాఖ ఈఈ జి.సురేష్‌బాబు అన్నారు. మండలంలోని రెల్లివలస గ్రామంలో పీఎం సూర్యఘర్ యోజన పథకంపై మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో గృహ వినియోగదారులకు సోలార్ విద్యుత్ అందజేయడం జరుగుతోందన్నారు. ఇంటి పైకప్పుపై 10 చదరపు మీటర్ల నుంచి 100 చదరపు అడుగుల స్థలంలో సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకొని సోలార్ విద్యుత్ తక్కువ ఖర్చుతో పొందవచ్చునన్నారు. ఇప్పటికే చాలా వరకు గ్రామాలలో సోలార్ విద్యుత్ అందించామని చెప్పారు. వినియోగానికి మించి వున్న మిగులు సోలార్ విద్యుత్ కొనుగోలు చేయడం జరుగుతోందన్నారు. రెల్లివలస గ్రామంలో 547 మంది గృహ వినియోగదారులు పీఎం సూర్య ఘర్ యోజన పథకానికి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీ కెఎస్‌పి.కుమార్, విద్యుత్‌శాఖ ఏఈ సిహెచ్.దేముడు, సోలార్ సిస్టం ప్రతినిధి ప్రసాద్, గ్రామ ప్రజాప్రతినిధులు ఇజ్జరోతు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భద్రతా నియమాలతోనే ప్రమాదాల నివారణ

- డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మణికుమార్



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మణికుమార్

విజయనగరం క్రైమ్: భద్రతా నియమాలను పాటించడం ద్వారానే ప్రమాదాలను నివారించగలమని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ డి.మణికుమార్ స్పష్టం చేశారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వాహనదారులకు రవాణా శాఖ ఆధ్వర్యంలో స్థానిక సంతకాల వంతెన వద్ద మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతి వేగంతో వాహనాలు నడపవద్దని కోరారు. డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని, రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌టీఓ జి.విమల, ఎంఈఓలు ఎం.మురళీకృష్ణ, యు.దుర్గాప్రసాద్, పి.శివరాంగోపాల్, కె.రవిశంకర్ ప్రసాద్, ఎం.ఉష, కానిస్టేబుళ్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు


- ఐటీఐ విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఐటీఐ జిల్లా కన్వీనర్ గిరి



మాట్లాడుతున్న ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ గిరి

విజయనగరం అర్బన్: ప్రభుత్వ ప్రైవేటు శిక్షణ కళాశాలలు అందిస్తున్న సాంకేతిక విద్యతో పరిశ్రమలలో ఉద్యోగావకాశాలు అధికంగా ఉన్నాయని జిల్లా ఉపాధి అధికారి అరుణ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ‘ఇంప్లాంట్ ట్రెనింగ్ మరియు ప్లేస్మెంట్’ అనే అంశంపై విద్యార్థుల తల్లిదండ్రులకు మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐటీఐ విద్య అనంతరం వచ్చే అవకాశాలను స్థానిక, స్థానికేతర అనేది చూడకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ టీవీ గిరి మాట్లాడుతూ ఐటీఐలో క్రమశిక్షణగా ఉండడం వల్లే మరిన్ని కంపెనీలు ముందుకు వస్తున్నాయని తెలిపారు. టాటా స్ట్రయివ్ మరియు సీమెన్స్ డ్యూయల్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ ట్రెనింగ్‌లో ఐటీఐని భాగస్వామిని చేసి శిక్షణలో తోడ్పాటు అందిస్తూ ఆ సంస్థ నుంచి వచ్చిన ప్రాజెకు కో-ఆర్డినేటర్ వి.సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ఐటీఐ చదువుతున్న రోజుల్లోనే పరిశ్రమ సంస్కృతి పెంపొందించుకునేలా శిక్షణా విధానం ఉంటే అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

సారిపల్లిలో కొనసాగుతున్న ప్రత్యేక పూజలు



ఆలయ కమిటీ సభ్యులను రూ.50వేల విరాళాన్ని అందిస్తున్న దాత శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ భ్రమరాంభిక మల్లిఖార్జునస్వామి ఆలయంలో శివ పంచాక్షరీ సప్తసప్తాహ మహా మంత్ర పూజలు వైభవంగా కొనసాగాయి. ఆలయ అర్చకులు స్వామికి వివిధ రకాల ఫల రసాలు, సముద్ర నదీ జలాలతో మంగళవారం విశేష అభిషేకాలను జరిపించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన దాత ఆల్తి శ్రీనివాసరావు అన్నదానం నిమిత్తం ఆలయ కమిటీ నిర్వాహకులకు రూ.50 వేల నగదు, నిత్యవసరాలను అందజేశారు. 49 రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు కొనసాగుతాయని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో శివ భక్తులు పాల్గొన్నారు.

పాఠశాలల సమస్యలను పరిష్కరించాలి

- ఎంఈఓకు యూటీఎఫ్ వినతి



ఎంఈఓ రాజుకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

విజయనగరం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పేరుకుపోయిన పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా యూటీఎఫ్ నాయకులు మంగళవారం విజయనగరం మండల విద్యాశాఖాధికారికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రాథమికోన్నత పాఠశాలల్లో సీనియర్ సహాయకులు లేరని, ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమం అమలు చేయడంతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిని తగ్గించాలని కోరారు. గ్రామ పంచాయతీలో ఒక ఆదర్శ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయడంతో పాటు ప్రస్తుత ఏకోపాధ్యాయ పాఠశాలల్లో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈఓకు అందజేశామని చెప్పారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘ సభ్యులు బి.గణేష్, పి.రామకృష్ణ, కె.రాజయ్య, పి.శ్రీనివాసరావు, గంటా సునీలతో పాటు పలువురు పాల్గొన్నారు.

శతశాతం మౌలిక వసతుల కల్పన

- కమిషనర్ నల్లనయ్య



13వ డివిజన్‌లో స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం రూరల్: నగర ప్రజలకు సంపూర్ణ మౌలిక వసతులు కల్పించడమే ప్రధాన ధ్యేయంగా పని చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య అన్నారు. నగరంలోని 13వ డివిజన్‌లో ఆయన మంగళవారం పర్యటించారు. స్థానికులతో మాట్లాడారు. తాగునీరు, పారిశుద్ధ్యం నిర్వహణ తీరుపై ఆరా తీశారు. నగరపాలక సంస్థకు సంబంధించి అందిస్తున్న సేవల్లో ఎటువంటి ఇబ్బంది వచ్చినా నేరుగా తనకు తెలియజేయవచ్చన్నారు. అనధికార భవనాలను తొలగించడం జరుగుతుందన్నారు. కాలువలపై నిర్మాణాలు చేసి పారిశుద్ధ్య నిర్వహణకు ఇబ్బంది కలగజేయరాదని కోరారు. బహిరంగ ప్రదేశాలలో మలవిసర్జన చేయరాదని హితవు పలికారు. నగర క్రమబద్ధీకరణకు అధిక ప్రాధాన్యతను ఇవ్వనున్నట్టు తెలిపారు. నగర ప్రజలు తనకు పూర్తి స్థాయి సహకారం అందిస్తే నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించడం జరుగుతుందని హామీ ఇచ్చారు. పర్యవేక్షణలో ఆయన వెంట కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన ఆధ్యాత్మిక నృత్య ప్రదర్శన



భగవతీ నృత్య కళామందిర్ చిన్నారులు చేస్తున్న ఆధ్యాత్మిక భక్తి నృత్యప్రదర్శన

విజయనగరం టౌన్: స్థానిక మూడులాంతర్లు జంక్షన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారు చదురుగుడి ఆలయం ఆవరణలో ఉన్న ఆధ్యాత్మిక కళావేదికపై మంగళవారం రాత్రి నిర్వహించిన చిన్నారుల నృత్యప్రదర్శన ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. భగవతీ నృత్య కళామందిర్ డైరెక్టర్ వడ్లమాని రమణకుమారి నేతృత్వంలో చిన్నారులు ప్రదర్శించిన కళారూపాలు చూపరులను భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. అనంతరం ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ ప్రసాద్, సూపర్‌వైజర్ ఏడుకొండలు కళాకారులను సత్కరించి, అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.



నృత్య ప్రదర్శనతో అలరిస్తున్న విద్యార్థులు

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



గుండాలపేటలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఈఓపీఆర్‌డీ

డెంకాడ: పరిసరాల పరిశుభ్రతతో పలు రకాల వ్యాధులను నివారించవచ్చని, తద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని ఈఓపీఆర్‌ఆర్‌డీ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పెదతాడివాడ పంచాయతీలోని గుండాలపేట గ్రామంలో కాలువల్లో పూడికతీత, పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. అనంతరం చెత్త నుంచి సంపద కేంద్రం నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత కోసం అందరూ తమ వంతు కృషి చేయాలన్నారు. బహిరంగ మలవిసర్జన నివారణ కోసం గ్రామాల్లో విజిలెన్స్ బృందాలు ఏర్పాటు చేయాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించి దీనిని పూర్తి స్థాయిలో నిర్వహణలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అప్పలనాయుడు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వాల్తేరు రైల్వే డివిజన్ ఉన్నట్టా.. లేనట్టా...!

- రైల్వే మంత్రి అశ్వనీ శ్రీవైష్ణవ్‌కి లేఖ రాసిన లోక్‌సత్తా పార్టీ



రైల్వే అధికారికి వినతిపత్రం అందజేస్తున్న లోక్‌సత్తా పార్టీ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: వాల్తేరు రైల్వే డివిజన్ ఉన్నట్టా, లేనట్టా అని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి ప్రశ్నించారు. దేశంలోనే అపారమైన పేరుతో పాటుగా రైల్వేకి సంపద సృష్టించిన వాల్తేరు డివిజన్ ఉందో.. లేదో.. తెలియని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ప్రకటించి ప్రధాన కార్యాలయానికి శంకుస్థాపన చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ శ్రీవైష్ణవ్ వాల్తేరు డివిజన్‌పై స్పష్టమైన ప్రకటన చేయాలని కోరుతూ లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కేంద్ర రైల్వే మంత్రికి రాసిన లేఖను మంగళవారం పార్టీ నాయకులతో కలిసి విజయనగరం రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ కె.మురళీకృష్ణను కలిసి అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు, డివిజన్లతో కలిపి దక్షిణ కోస్తా రైల్వేజోన్ ప్రకటించినప్పటికీ, నేటి వరకూ జీఎంను గాని, జోన్ పరిధినిగాని, డివిజన్ పరిధినిగాని ప్రకటించలేదని అన్నారు. తూర్పు కోస్తా రాయఘడ డివిజన్, జమ్మూ డివిజన్‌లను జనవరి 6న ప్రకటించిన ప్రధాని మోదీ వెంటనే అక్కడ డీఆర్‌ఎంలను డివిజన్ల పరిధిని కూడా ప్రకటించారని భీశెట్టి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎంపీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వాల్తేరు డివిజన్‌పై ప్రకటన చేయించాలని, వెంటనే కార్యకలాపాలు ప్రారంభం అయ్యేలా చూడాలని కోరారు. ఈ జాప్యం వల్ల రైల్వే శాఖలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని భీశెట్టి ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు అల్లంశెట్టి నాగభూషణం, తాత్రాజు రాజారావు, పోలుపర్తి అప్పారావు, పౌర వేదిక ప్రతినిధి తుమ్మగంటి రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అరుణ జ్యూట్ మిల్లు స్థలాన్ని అటాచ్ చేయాలి

- మిల్లు వర్కర్స్ యూనియన్, ఏఐఎఫ్‌టీయూ న్యూ అధ్యక్షుడు శంకరరావు



అరుణ జూట్ మిల్లు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

విజయనగరం టౌన్: అరుణ జ్యూట్ మిల్లు స్థలాన్ని పీఎఫ్ అధికారులు అటాచ్ చేయాలని అరుణ జ్యూట్ మిల్లు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు, ఏఐఎఫ్‌టీయూ న్యూ అధ్యక్షుడు బి.శంకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మిల్లు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లులో పని చేసిన కార్మికులకు ఫుల్ అండ్ ఫైనల్ అగ్రిమెంట్ ప్రకారం పీఎఫ్ స్టాఫ్ గ్రాట్యుటీ, సిక్ లీవులు యాజమాన్యం చెల్లించకుండా పరారై పోయిందన్నారు. మిల్లు స్థలాల అమ్మకాలు, కొనుగోలు నిషేధించాలన్నారు. కార్మిక బకాయిలు క్లియర్ కాకుండా సురభి అర్బన్ వన్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ ఏ విధంగా మిల్లు స్థలాలు కొనుగోలు చేసిందని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ సమక్షంలో ఎస్‌ఎల్‌ఎస్ యాజమాన్యం, పీఎఫ్ అధికారులు, లేబర్ కమిషనర్, యూనియన్ ప్రతినిధులతో జాయింట్ మీటింగ్ నిర్వహించాలన్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు, ఎమ్మెల్యేకు అనేక దఫాలుగా కలిసి వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ నేటికీ న్యాయం జరగలేదని అన్నారు. ఇది అన్యాయమని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కరించకపోతే ఎమ్మెల్యే ఇంటి వద్ద ధర్నా చేపడతామన్నారు. ధర్నాలో కార్మిక నాయకులు పి.శ్రీనివాసరావు, బి.అప్పారావు, ఆర్.ప్రకాశరావు, మద్ది అప్పలరాజు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

బెంగాలి మోడల్ వరి ఉబాలు ప్రయోజనం



వరి ఉబాలను పరిశీలిస్తున్న ఏఓ

డెంకాడ: బెంగాలి మోడల్ వరి ఉబాలతో అన్ని విధాల మేలు అని ఏఓ పూడి నిర్మల అన్నారు. పొలంబడి పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని పినతాడివాడ పరిధిలోని పాలగెడ్డ రిజర్వాయర్ ప్రాంతంలో బెంగాలి మోడల్ వరి ఉబాలను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ వరి ఉబాలను ఒక క్రమ పద్ధతిలో చేస్తారన్నారు. దీంతో పంటకు గాలి, వెలుతురు బాగా తగిలి పలు రకాల తెగుళ్లు నివారించవచ్చని వివరించారు. ఎరువులు, పురుగు మందులు చల్లేందుకు కూడా రైతులకు వీలుగా ఉంటుందన్నారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రం నుంచి వచ్చిన కూలీలు ఎకరా పొలానికి సరిపడే వరి ఆకుతీసి, ఉబాలు చేయడానికి రూ.4500 తీసుకుంటున్నారని ఆమె తెలిపారు. దీనివలన సాగు ఖర్చు కూడా బాగా తగ్గుతుందన్నారు. పినతాడివాడ, పెడాడ రెవెన్యూ గ్రామాల పరిధిలో బెంగాలి విధానంలో 70 ఎకరాల వరి ఉబాలు వారు చేశారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు, కూలీలు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి స్పందన



వెంపడాంలో పశువైద్య శిబిరం వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏడీ తదితరులు

పూసపాటిరేగ : మండలంలోని వెంపడాం గ్రామంలో మంగళవారం జరిగిన పశువైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. వెంపడాం పరిధిలో పశువులు, మేకలు, గొర్రెలకు టీకాలు వేసి ఉచితంగా వైద్యం అందించారు. శిబిరంలో 205 సాధారణ పశు వైద్య చికిత్సలు, 75 గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, 400 వ్యాధి నిరోధక టీకాలు, 300 మేకలకు నట్టలు నివారణ మందులు వేశారు. 25 పశువులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. శాస్త్రీయ యాజమాన్యంపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పశువైద్య శిబిరాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పశువైద్య శాఖ ఏడీ చక్రవర్తి, పశు వెద్యాధికారి ఈశ్వరశ్రీనివాస్, సర్పంచ్ పిన్నింటి కుమార్, మాజీ సర్పంచ్ పిన్నింటి శ్రీనివాసరావు, స్నేహ అప్పలనాయుడుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కోనయ్యపాలెంలో ఉచిత పశువైద్య శిబిరం జరిగింది. గోవిందపురం పశు వైద్యాధికారి యు.రాజేశ్వరి పలు సూచనలు చేశారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దాం



హోంశాఖ మంత్రి వంగలపూడి అనితకు బుద్ధుడి విగ్రహాన్ని అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం రూరల్: జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు నడిపించడానికి ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు అందరూ సమష్టిగా ముందుకు రావాలని రాష్ట్ర హోం మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వంగలపూడి అనిత సూచించారు. ఈ మేరకు స్థానిక మెసానిక్ టెంపుల్‌లో మంగళవారం టీడీపీ విస్తృత స్థాయి సమావేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున ఆధ్యక్షతన జరగ్గా ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత టీడీపీ నాయకులు, ఎమ్మెల్యేలపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు పి.అదితి గజపతిరాజు, కళా వెంకటరావు, కోళ్ల లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయ ఆధునికీకరణకు చర్యలు

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్, ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయాల అభివృద్ధి, ఆధునికీకరణకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయాన్ని మంగళవారం ఆమె సందర్శించి, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్ పుష్పగుచ్ఛం ఇచ్చి ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కార్యాలయాల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు పంపించాలని కోరారు. అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఓఎస్‌డీ అనిల్ పులిపాటి, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.